

# స్మశాన శతదినోత్సవం

ఇచ్ఛాపురపు రామచంద్రం

కాశిపట్నం - అటు పెద్దదీకాదు, అలాగని చిన్నదీ కాదు. ఒక మాదిరి వూరు. ఊరు కనుక జనమూ.. కనుక ఓట్లూ కనుక రాజకీయమూ పుష్కలంగా ఉన్నాయక్కడ.

ఈ దేశంలో తిండికి కరువేగాక, జనానికి కొరతుండదు; విద్యకు వెతుకులాటేగాక - రాజకీయం బోలెడంత. మనిషన్నాక కుడీ ఎడమలు సహజమైనట్లే ఆవూరిలోనూ పాలక ప్రతిపక్షాలకు చెందిన వారు కొంచెం అటూ యిటూగా సమానంగానే ఉన్నారు.

జాతస్య మరణం ధ్రువమ్. మరణించిన వారికి (నిజానికి, మరణించినవారి వారికి) స్మశానం అత్యవసరం. కాని.. చిత్రంగా.. అలాటి దా(గ్రామంలో మూజ్యం ప్రత్యేకంగా స్మశానమంటూ లేక తమ శవాలను (అదే.. తమ వారివి) ఎక్కడ వీలయితే అక్కడ దహనమో ఖననమో చేసి గండం గట్టెక్కుతూ వొస్తున్నారచ్చటి వారు. అంతలో - ఎన్నికలు ప్రకటించబడ్డాయి. తేదీకోసం గోతి దగ్గర నక్కల్లా కాచుక్కూర్చున్న ప్రతిపక్షం నాయకులు. దినం ఆలస్యం చేయకుండా ప్రచారం మొదలు పెట్టేశారు.. అలాగ కాశీపట్నం వొచ్చిన ప్రతి పక్ష రాజకీయ నాయకుడు యిలాగ ఉపన్యసించాడు -మీటింగు పెట్టి, (స్వ) జనులను పోగు చేయించుకుని.

' ఈవూరి పేరు కాశీపట్నమా! ఈవూరికి మచ్చు కొక్క స్మశాన మయినా లేకపోవడమా! నా కడుపు తరుక్కు పోతూంది. గుండె మండి పోతుంది. ఒక్కటయినా వల్లకాడులేక ఎల్ల జనములూ ఎంత అల్లల్లాడుచున్నారో! కాశీ కాపేరూ ప్రసిద్ధీ ఎందుకు వొచ్చాయో తెలుసా? అక్కడున్నన్ని స్మశానాలు మరెక్కడా లేకనే. హరిశ్చంద్ర ఘాటు.. అశ్వమేధ ఘాటు.. ఆఘాటు యీఘాటు.. గంగ వొడ్డంతా శవధూమ ఘాటే. కాశీ పేరు పెట్టుకునీ యీవూరి కొక్కటంటే వొక్కటి స్మశానం లేకపోడం భరతమాత కే సిగ్గు చేటు. ఇది -పాలకపక్షం మీకు చేసిన అన్యాయమే. అసమర్ధతే మిమ్మల్నీ మీ వూరినీ చూస్తూంటే నా కడుపు తరుక్కు పోతూంది. గుండె కరిగి నీరై పోతూంది.





నా ప్రియమయిన ఓటర్లలారా! మీ స్మశానానికి నా స్వంత ఖర్చుతో శంఖుస్థాపన చేస్తానిప్పుడే. ఈఎన్నికలలో మాపార్టీని గెలిపించారో - హిందువులకు దహనవాటిక, ముస్లిములకు కబ్రస్థాన్.. క్రిష్టియనులకు శాంతి వనము నిర్మాణానికి ప్రభుత్వ శాంక్షన్ తెప్పిస్తానని వినయ పూర్వకంగా వాగ్దానం చేస్తున్నాను. మూడు మతాల వారికీ విడి విడిగా మూడు స్మశానాలను నిర్మిస్తుంది మా ప్రభుత్వం. కనుక - మీరు కుల మతాలకూ, మెజారిటి మైనారిటీ భావాలకూ

అతీతంగా నిమ్న కులాల నుంచి అగ్రకులాల వరకూ, హిందువుల నుంచి క్రైస్తవులవరకూ అందరి వోట్లూ మాకే వేసి మా పార్టీని ఘనమయిన మెజారిటీతో గెలిపించమని ప్రార్థిస్తున్నాను.' అంటూ స్మశాన వాగ్దానమూ శంఖు స్థాపనంటూ ఓరాయీ వేసి పోయాడు.

తానొకందుకు పోస్తే వాడొకందుకు తాగడని - ఆ ఉపన్యాసం హోరుతో పురజనుల కొకటి అర్థమయింది. బార్‌కి రమ్మెంత ముఖ్యమో ఊరికీ పురమ్ముకీ స్మశానమంత అవశ్యకమని మనసుకి నాటేసి - ఇంటికొక యూకొల్లాలి కొక కంబళీ అన్న నానుడిని గుర్తు చేసుకుని తలొకొంచెమూ చందాలు వేసుకుని - తమ స్మశానం (అమంగళము ప్రతిహతమగు గాక) తామే ఏర్పాటు చేసేసుకున్నారు ప్రభుత్వాన్ని నమ్మడం కంటె తెలివి తక్కువ మరేదీ ఉండదని అనుభవ పూర్వకంగా తెలిసిన వారు కనుక.

ఎన్నికలయ్యేసరికి - వీరి స్మశానం ప్రారంభం కూడా అయిపోయింది. ఏ సుముహార్తాన శంఖుస్థాపన జరిగిందో కాని మూడు రోజులూ ఆరు శవాలూగా కలకలలాడ సాగింది దహన/ఖనన వాటిక.

మన దేశంలో పాలించే పార్టీ ప్రజలను నానా దుఃఖాలూ పెట్టేసి విసిగించేసి వొదులుతుంది కనుక నెగెటివ్ వోట్ అనవాయితీ ఐపోయి ఎన్నికలంటే అంతవరకూ ఉండే ప్రతిపక్షపు గెలుపు ఖాయమైపోతుంది. ఏరాయయితేనేం, నెత్తి బద్దలు కొట్టు కుందుకన్న నిరాశావాదుల సంఖ్య స్వల్పమూ.. యీసారి వీడిని గెలిపిద్దాం, ఏమన్నా ఉద్ధరిస్తాడేమో, వాడికంటె తక్కువ కష్టాలు పెడతాడేమో అనే - వెర్రి పీరులయిన ఆశావాదుల సంఖ్య అధికమూ కనుక.. కోళ్లను తినేవాడు పోయి గొర్రెలను తినేవాడొస్తాడు. లక్షలు తినేవాడు పోయి కోట్లు తినేవాడొస్తాడు. అనవాయితీ తప్పకుండా - స్వశక్తి మీద గెలవగలిగే సామర్థ్యం ఎవరికీ లేక - కాశీపట్నానికి స్మశాన వాగ్దానం, శంఖుస్థాపనా చేసిన అభ్యర్థి గెలవడమూ జరిగింది, మంత్రి కావడమూ జరిగింది. కాక చస్తాడా? మిగిలిన అభ్యర్థులందరూ జేబు దొంగతనం నుంచి - మర్డర్ శిక్షగా జెయిలులో పెట్టబడితే మధ్యలో తప్పించు కొచ్చిన బాపతులే. జేబుదొంగతనానికి ఒక పాయింటు, మామూలు దొంగతనానికి రెండు పాయింట్లూ.. రేప్‌కి నాలుగూ.. మర్డర్‌కి ఐదు చొప్పున పాయింట్లు వేసి - తక్కువ నుంచి మంత్రుల నేర్పాటు చేశాడు పార్టీ నాయకుడు. ఆయన మాత్రం ఏం చేయగలడూ- అందరూ నల్ల వెంకన్నలే ఐతే? తక్కువ చెడ్డ అభ్యర్థులను మంత్రి మండలి లోకి తీసుకున్నాడు. - న్యాయబద్ధంగా. మన అభ్యర్థి - రెండు పాయింట్ల తేడాతో మంత్రి అయ్యాడు. కాని - అప్పటికే కాశీ పట్నంలో స్మశాన నిర్మాణం




పూర్తయిపోయిందని - రోజూ శవాలు బూడిదై పోతున్నాయనీ తెలిసింది. దాంతో - "నేను శంకుస్థాపన చేసిన శ్మశానం పూర్తి చేసిన దమ్ములెవడికి? ఆ శ్మసానం పడగొట్టించేసి మళ్లీ శంకుస్థాపన చేసి కట్టిస్తా . ఫలానా మంత్రిగారి స్మశానం అని పాలరాతి పలక మీద రాయిస్తా. అవటా" అని అంతెత్తున లేచాడు కానీ - అతని ఎమ్మెల్యేలు - "స్మశానాలంటే సెంటిమెంట్లు. ప్రజలు కట్టుకున్న సెంటిమెంట్లన్నీ స్మశానాలని ముట్టుకున్నామో పరిణామాలు బాగుండవు -' అని మందు మీద హితోపదేశం చేశారు.

"మరెలా? నేనా స్మశాన ప్రారంభోత్సవం మీద ఎన్ని ఆశలు పెట్టుకున్నా? ప్రారంభోత్స వోపన్యానము కూడా అవేళే అడ్వాన్సుగా రాయించుకున్నా. గెలుపూ మంత్రి పదవి ఎలాగూ ఖాయమే అని.." వాపోయాడు మంత్రి. అది అతని తప్పుకాదు. మంత్రి పోస్టదే. మినిస్టర్లుకూడా పాపులారిటీ మీద మినిసార్ట కుండేంత క్రేజ్. నలుగురు జనముంటే చాలు తమని తాము ప్రదర్శించేసు కోవాలనే వెర్రి. వినే వాళ్లుంటే ఉపన్యాసాలకి లంకించేసుకుంటారు. తమని చూసేవాళ్లూ వినేవాళ్లూ మామూలుగా ఉండరు కనుక. మినిస్టర్ల ముఖాలేవీ అందంగాఉండవు -ఎక్కువ మందివి. వాళ్ల మాటలలో పస శూన్యం. పైగా ఆత్మస్తుతీ, పరనిందా (ప్రతిపక్షనిందా). లారీలు పంపి - పలావులూ బత్తెం ఖర్చులూ ఆశ చూపి అయినా సరే జనాల ముందు వెలిగి పోవాలని దిగజారుతారు. సున్నితమయిన భాషలో - స్వకపోల మర్దనా ప్రియులు) ఎప్పుడూ - ఎక్కడ ఎలా జనం దొరుకుతారా స్వంత (పార్టీ) డబ్బో వాయించే సుకుందామా అదే వాళ్ల తాపత్రయం.

అందుకే - మంగలి షాపు కయినా మందుల కంపెనీకయినా - ప్రారంభోత్సవం అంటే చాలు పిలవకముందే పేరంటానికీ ఉపన్యాసానికీ వొచ్చేస్తారు మంత్రులు. ప్రజాసేవ వీళ్ళ సాధ్యమూ కాదు. ధ్యేయమూ కాదు. పదవిని కాపాడుకొనే పవిత్ర కర్తవ్యం. అందుకనువయిన మార్గం. ప్రజలని వెర్రి వాళని చేసే ప్రసంగాలు, మంత్రిగారి మంది మార్బలాలను చూసి గొప్పవారను కుంటారని ఎక్కాశ. ఇలాంటి బలహీనతలన్నీ అంటి ఉంటాయి మంత్రి కుర్చీని.

"ఇది నా ప్రిస్టేజి కొశ్చను . ఆ స్మశానం లో నా సభ జరగాల్సిందే. " గ్లాసు పగులగొట్టి మరీ తన ఉపన్యాసోత్సాహమునూ పట్టుదలా ప్రకటించాడు. కొంచెం ఆలోచించి - "సరే. వారం రోజులలోగా స్మశానం ప్రారంభించి వంద రోజులు కాబోతోంది. ఆ ఫంక్షను ఏర్పాటు చేస్తాను. తమరు ఉపన్యసిద్దురు గాని " అని ఆ ప్రాంతపు ఎమ్మెల్యే మంత్రిని చల్లబరిచాడు - గ్లాసుతో ఐసు వాటరిచ్చి.

స్మశాన శతదినోత్సవేర్పాట్లు చురుకుగా సాగాయి. కొందరికి - స్మశానాలు శతమా? అని అనుమానం వొచ్చింది. మరికొందరికి... దినమంటే - తద్దినంలా మరణించిన రోజు. స్మశానానికి దినమేమిటి? స్మశానం మరణించడమేమిటి? అనే అనుమానం వొచ్చింది. వాళ్ల ప్రశ్నలకు జవాబులు చెప్పే నాథుడు లేకపోయాడు. ఎట్టకేలకు మంత్రి గారి ఉపన్యాస సమయం దాపురించింది. కార్యదర్శి వ్రాసి పెట్టిన కాగితాలవతల పెట్టేసి - ఆశువుగా మాట్లాడ సాగాడు.

"సోదర సోదరీమణులారా! వొదినా మరదళ్లారా.. బావల్లారా... చిన్నాన్న పెద నాన్నల్లారా! (శ్రోతలలో మంత్రిగారి కావరసయ్యే బంధువులున్నారు మరి) అందరికీ వందనములు. ఆ... స్మశానమంటే ఏటో సూద్దాం తొలీత. శానా అంటే చాలా అని అర్థం. శానామంది వెళ్లేది కనక స్మశానం అన్నారు దీన్ని..."

జనం లోంచి చప్పట్లు. అందుకు కూలి ఏర్పాటు చేయబడినవారూ... పై వాళ్లూ కూడా తన ప్రతిభకు పొంగిపోతూ.. "నేనే మీకోసరం స్మశానాన్ని కట్టిద్దామనుకున్నాను. కాని మీరు తొందరపడిపోయారు. కట్టేసుకున్నారు. స్మశానాన్ని

యింగ్లీషులో బ్రోతల్ గ్రౌండంటారు.."

ఈసారీ చప్పట్లు.. కాని.. అందుకేర్పాటు చేయబడిన వారివి కావు. "ప్రతి వూరికీ బడీ గుడీలాగే స్మశానమూ ఉండి తీరాలి. అసలు నన్నడిగితే యింకేవీ లేకపోయినా పర్వేదుకాని స్మశానం మాత్రం వుండి తీరాలంటాను. నాకు స్మశానమంటే అంతబిమానమూ.. యిష్టమూను. ఆ..." సకిలించాడు. "సినేమాలే.. సిరంజీ పినిమాలే సెతదినోత్సవం సేయించుకోడం బ్రెమ్మాండమై పోతున్న యీ రోజుల్లో ఒక స్మశానం శతదినోత్సవం చేయించుకోడ మంటే అల్లాటప్పా, ఆటలూ కాదు. మీవూరి.. స్మశానంకి యిలా నూర్రోజులు నిండడం నాకు శానా ఆనందంగా ఉంది-"

చప్పట్లు.

"స్మశానాల్లో బోలిడన్ని రకాలు వున్నాయి ప్రెంపంచకంటా. అమెరికాలో ఐతే కరంటు కుర్చీ స్మశానాలు. బలేగా ఉంటాయి. నస్తే - అమెరికాలో సావాలని పించేస్తది. మన యిళ్లకంటె బాగుంటాయి తెల్లోళ్ల స్మశానాలు. తెలుసా?

చప్పట్లు... ముందుగా డబ్బు తీసుకున్న వారివీ, పై వారివీ కూడా. "నన్నడిగితే - స్మశానాలే దేశ పురోభివృద్ధికి తారుకానాలు. ఏ దేశంలో ఎక్కువ స్మశానాలుంటే ఆదేశం గొప్పన్నమాట. కాశీలో ఎన్నో స్మశానాలుండ బట్టే కద అదంత పేరు తెచ్చుకుంది? ఏటంటారు?"

చప్పట్లు.

"నేను కొంచెం నిలదొక్కుకున్నాక.. ఇంటికొక స్మశానం పథకం ప్రారంభించాలను కుంటున్నాను. మీరందరూ ఓట్లేసేస్తారుగా? ఓకె అంటారుగా?'

'మీ రాజకీయ నాయకుల అరాచక పాలనలో రాష్ట్రమే ఒక పేద్ద స్మశానం ఐపోయింది. మళ్లీ యింటికో స్మశానం పథకం కూడా ఎందుకూ?' ప్రేక్షకుల లోంచి గొణుగుళ్లూ సణుగుళ్లూ.

"నూర్రోజులు నిండిన యీ - మీవూరి స్మశానాన్ని చూస్తొంటే నాకు ఎంతో ముచ్చటేసే స్తొంది నిముష నిముషానికీ. నాకెక్కడికీ వెళ్లకుండా యిక్కడే ఉండాలని పించేస్తుంది... కాని.. ఎళ్లక తప్పదు. మరో వూళ్లో స్మశాన ప్రారంభోత్సవం చెయ్యాలి. ఇప్పటికే ఆలీసమై పోనాది, శలవిప్పించండి ప్రెజలూ. నూర్రోజులు నిండిన పండగ జేసుకుంటున్న మీ స్మశానం పదికాలాల పాటు పచ్చగా ఉండాలని ఆ పరమేశ్వరుణ్ని ప్రార్థిస్తాను. శలవ్..." అంటూ దణ్ణాలు పెట్టేసి జీపెక్కేశాడు మంత్రి.

నువ్వు మరో నిముషం అలాగే మాట్లాడితే - మేము నిన్నా పరమేశ్వరుడి దగ్గరకే పంపేవాళ్లం - అంటున్న వాళ్లని,

మంత్రి పార్టీవారు - "ప్రతిపక్షం వోళ్లు" అనేశారు. ●


# రు. 1,50,000 బహుమతులు పొందండి

ఎంట్రీ ఫీజులేదు

| | | |
|---|---|---|
| 6 | 11 | 4 |
| 5 | 7 | 9 |
| 10 | 3 | 8 |

మొదటి బహుమతి రాజ్‌దూత్ మోటర్ సైకిల్
కలర్ టి.వి.
కన్సొలేషన్ : టు-ఇన్-వన్,
ట్రాన్సిస్టర్లు, కెమెరాలు, చీరెలూ,
రిస్టువాచీలు (పరస్పరమార్పిడి పథకం కింద)

| | | |
|---|---|---|
| 7 | | |
| | 8 | |
| | | 9 |

పైన చూపినట్టు పోస్టుకార్డు మీద ఖాళీ చదరాలు గీయండి 4 నుంచి 12 వరకు అంకెలు మాత్రమే వాడాలి. ఎటు తిప్పికూడినా 24 రావాలి. ఒక అంకె ఒకేసారి వాడాలి. మీ ఎంట్రీలను సాధారణ పోస్టులో పోస్టుకార్డు మీదనే పంపండి. మొదటి 51 ఎంట్రీలకు స్టీరియో-డెక్ ఉచితం.

GENEVA ELECTRONICS (RP)
P.B.NO. 9494, DELHI 110051